సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

- భీమిలిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయం
- భారీగా పెరిగిన పోలింగ్



తగరపువలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాలే భీమిలి అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు గెలుపునకు దోహదపడే వాతావరణం కనిపిస్తోంది. ముఖ్యంగా ఇక్కడ అభ్యర్థులను బట్టి కాకుండా పార్టీ అధినేతలు చేసిన అభివృద్ధిపైనే ఓటర్లు దృష్టి సారించినట్టు తెలుస్తోంది. దీనిని బట్టి ముత్తంశెట్టి శ్రీనివాసరావు గతంతో పోలిస్తే రెట్టింపు మెజార్టీ తథ్యమంటున్నారు విశ్లేషకులు. చంద్రబాబు హయాంలో కేవలం టీడీపీ నాయకులకే జన్మభూమి కమిటీల ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు అందించేవారు. వీళ్ల కమీషన్ పద్ధతిలో లబ్ధిదారులకు వీటిని అందించేవారు. 2014–19 హయాంలో చంద్రబాబు రైతులు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ పేరుతో మోసం చేశారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి పేరుతో నిరుద్యోగులను వంచించారు. 2019 ఎన్నికల ముందు పసుపు కుంకుమల పేరుతో రూ.10వేలు ఇచ్చారు. ఆయన ఆశా, అంగన్వాడీ, డ్వాక్రా వీవోఏలకు గొర్రెతోక వేతనంతో గొడ్డు చాకిరీ చేయించుకున్నారు. ఇవన్నీ భీమిలి ఓటర్లు మర్చిపోలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం జగన్ సంక్షేమ పథకాల జాతరకు తెరతీశారు. ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను జత చేసి మహిళలకు పెద్దపీట వేశారు. గతంలో పురుషుల ఆదాయంపైనే ఆధారపడి బతికే కుటుంబాలు మహిళలు కూడా ఆర్థిక స్వావలంబన సాధించడంతో వైఎస్సార్‌సీపీపై నమ్మకం పెరిగింది. చిన్నారులు, కార్మికులు, రైతులు, కూలీలు, విద్యార్థులు, వృద్ధులు ఇలా ఇన్నిరంగాల ప్రజల సక్షేమంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టి సారించి నేరుగా వారి ఖాతాలకు రూ.2.70 లక్షల కోట్లు జమ చేశారు. అభివృద్ధి పేరుతో స్కూళ్లు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆస్పత్రులు, రోడ్లు, డ్రైనేజీలు, పార్కులకు పెద్దపీట వేశారు. కోవిడ్ వంటి కష్టకాలంలో రాష్ట్రానికి ఆదాయం లేకపోయినా ప్రజలను ఆదుకున్నారు. నగదు సాయంతో పాటు ఉచిత రేషన్, వ్యాక్సిన్లు వంటివి అందించారు. దేశానికి స్వాంత్ర్యం వచ్చిన తరువాత దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు చేయనన్ని సంక్షేమ పథకాలు అమలు చేసి సీఎం జగన్ మిగిలిన ముఖ్యమంత్రులకు మార్గదర్శకమయ్యారు. సాక్షాత్తూ ప్రధాని మోడీ కూడా సీఎం జగన్ సంక్షేమ పథకాల అమలుకు ముగ్ధులయ్యారు.

హ్యాట్రిక్‌పై ముత్తంశెట్టి కన్ను

ప్రతి ఎన్నికల సమయంలో నియోజకవర్గాలు మార్చే గంటా శ్రీనివాసరావు 2014–2019 కాలంలో అవకాశం ఇస్తే తన అనుచరులతో కబ్జాలకు తెర తీశారు. హుద్‌హుద్ వంటి కాష్టకాలంలో తన నియోజకవర్గ ప్రజలు ఎలా ఉన్నారో చూడలేదు. నియోజకవర్గం మార్చినప్పుడు కూడా ఇక్కడి ప్రజలు, కార్యకర్తలు, నాయకులకు చెప్పకుండా పారిపోయారు. భీమిలిలో రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ముత్తంశెట్టి శ్రీనివాసరావు గత అయిదేళ్లలో ప్రతి గడపకు సందర్శించి ప్రభుత్వం సాయంతో సంక్షేమ, అభివృద్ధి పథకాలను పరుగులెత్తించారు. దీంతో భీమిలి ప్రజలు మూడోసారి ముత్తంశెట్టికి పట్టం కట్టేందుకు అనుకూలంగా ఉన్నట్టు తెలుస్తోంది.

పెరిగిన పోలింగ్ శాతం..

2019 ఎన్నికలలో భీమిలిలో 73.90 శాతం పోలింగ్ నమోదు కాగా సోమవారం జరిగిన పోలింగ్‌లో 75.96 శాతం నమోదయింది. గతంతో పోలిస్తే ఓటర్లు కూడా సుమారు 30వేల మంది పెరిగారు.

భీమిలిలో ఫ్యాన్ పక్కా..

పీఎంపాలెం: భీమిలి అసెంబ్లీ నియోజక వర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మరోసారి ఎమ్మెల్యే కానున్నారా అన్న ప్రశ్నకు స్థానిక ఓటర్ల నాడినిబట్టి చూస్తే ఔననే సమాధాం వస్తోంది. నియోజకవర్గాలు మార్చి.. మార్చి మళ్లీ భీమిలికొచ్చిన టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావుకు తొలిసారి భంగపాటు తప్పదన్నట్టు పోలింగ్ సరళిని బట్టి తెలుస్తోంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రయోజనం పొందిన ప్రజలంతా చాలా స్పష్టంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. మేలు చేసిన ప్రభుత్వాన్ని కాపాడుకుంటామని, మళ్లీ జగన్‌ను సీఎంను చేసుకుంటామని కచ్చితమైన అభిప్రాయంతో ఓటు వేశారని తెలుస్తోంది. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును ప్రజలకు మరింత దగ్గరయ్యారు. ఒక విధంగా చెప్పాలంటే భీమిలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే పర్యటించని వీధిలేదు. తొక్కని గడపలేదు. పలకరించని పొరుడు లేడు అన్నంతగా ఆయన ప్రజలతో మమేకమయ్యారు. ప్రత్యర్థి గంటా శ్రీనివాసరావు గతంలో ఇదే నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పని చేసినా ఏనాడూ ప్రజల ముఖం చూడ లేదు. దీంతో ప్రజలు గంటాను పట్టించుకోవడం మానేశారు. ఇవన్నీ కూడా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు అనుకూలంగా మారనున్నాయని నియోజకవర్గ ప్రజలు ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చేశారు.

మహిళా తీర్పే కీలకం

భీమిలిలో ఓటేసిన 1,40,446 మంది మహిళలు

మధురవాడ : సార్వత్రిక తీర్పులో మహిళా ఓటు అత్యంత కీలకంగా మారనుంది. గతం ఎన్నడూ లేనంతగా ఈ సారి మహిళలు చైతన్యం వెల్లివిరిసింది. ఇంటివరకూ వచ్చిన పెన్షన్లు అడ్డుకోవడంతో రగిలిపోయిన అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, వివిధ పథకాలకు సబంధించి నిధుల విడుదలకు అడ్డంకం సృష్టించిన చంద్రబాబు అండ్ కోపై ప్రతికారం తీర్చుకునేలా ఓటు వేసినట్టు జోరుగా చర్చ సాగుతోంది. ప్రతిపక్షం అనేక అనేక ప్రలోభాలకు గురిచేసినా మహిళా ఓటరు మాత్రం కనీసం బెణకలేదు. నిర్భయంగా తమకు అండగా ఉండే పార్టీకి ఓటు వేస్తున్నట్టు వారి పట్టుదలను చూసి అందరికీ అర్థమైంది. సాయంత్రం అయ్యే సరికి కొంత మంది మహిరంగంగానే వారి అభిప్రాయాన్ని వెలుబుచ్చారు.

భీమిలి నియోజకవర్గంలో 3,63,013 ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 1,78,090మంది ఉంటే మహిళలు 1,84,908మంది ఉన్నారు. ఇతరులు 15 మంది ఉన్నారు. వీరిలో 1,35,301 మంది పురుషులు ఓటు హక్కు వినియోగించుకుంటే, 1,40,446మంది మహిళలు ఓటు వేశారు. మొత్తంగా 2,75,747 ఓట్లు పోలయ్యాయి. మహిళలు ఎక్కువ మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీనిని బట్టి ఈ ఎన్నికల్లో మహిళ ఓటర్ల తీర్పే కీలకం కానుంది.



క్యూలో మహిళా ఓటర్లు (ఫైల్)

ప్రతి కార్యకర్తకూ రుణపడి ఉంటా

- మండుటెండలో సైతం నా వెంట నడిచారు
- నా గెలుపు మీ విజయంగా భావించారు
- కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



భీమిలిలో నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: 'మండుటెండలో నా వెంట నడిచారు. ఎంతో ఆదరాభిమానాలు చూపారు. నా గెలుపు మీ విజయంగా భావించి ప్రచారం చేశారు. మీకు రుణపడి ఉంటా' అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఉద్వేగానికి గురయ్యారు. భీమిలిలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం జరిగిన పోలింగ్‌లో ఓటేసిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఓటింగ్ శాతం పెరిగేలా పార్టీ శ్రేణులు చేసి కృషిని ఆయన అభినందించారు. మూడో సారి తనకు భీమిలి నుంచి పోటీ చేసే అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో పాటు తనకు అండగా నిలిచిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. 25 వేల పైచిలుకు మెజార్టీతో తాను గెలవబోతున్నానని చెప్పారు. భీమిలిలో టీడీపీ నాయకుల మైండ్ గేమ్ పనిచేయలేదన్నారు. టీడీపీ నేతలు ఇక్కడ భూములు దోచుకుని ఆస్తులు పెంచుకవడం తప్ప ప్రజలకు చేసిన మేలు లేదన్నారు. కార్యకర్తలే తన బలమన్నారు. భవిష్యత్తులో భీమిలి ప్రజలకు మరింత సేవ చేసి వారి రుణం తీర్చుకుంటానన్నారు.

అన్నం పెట్టిన చేతిని కుక్క కూడా కరవదు..

అన్నం పెట్టిన చేతిని కుక్క కూడా కరవదని ఎమ్మెల్యే ముత్తంశెట్టి అన్నారు. అలాంటిది 2019 ఎన్నికల్లో తాను గెలిచిన తరువాత టీడీపీలో కొందరు దౌర్భాగ్యులు వారి స్వప్రయోజనాల కోసం వైఎస్సార్ సీలో చేరి ప్రభుత్వ పదవులు అనుభవించారని, 2014 ఎన్నికల్లో ప్రలోభాలకు ఆశపడి తిరిగి టీడీపీలో చేరారన్నారు. వారంతా కుక్కలకంటే హీనులన్నారు.అందుకే వారిని ప్రజలు ఛీకొట్టారన్నారు. వీళ్లకు ఏమాత్రం సిగ్గు ఉంటే తమ పదవులకు రాజీనామాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దొలపల్లి ఏడుకొండలు, అక్కరమాని రామునాయుడు, అల్లిపల్లి నరసింగరావు, శిల్లా కరుణాకరెడ్డి, జీరు వెంకటరెడ్డి, కదిరి ఎల్లాజీ, మైలపల్లి షణ్ముఖరావు, జీరు సుజాత, వాసుపల్లి కొండబాబు, పాసి స్వర్ణలత, జీవీ రమణ, ఉప్పాడ నాగేశ్వరరావు, అక్కరమాని చినబాబు, చిల్ల ప్రమీల, పందిరి విజయ్, చిల్ల బాబయ్యరెడ్డి, చేట్ల ఎల్లయ్యరెడ్డి, జీరు పద్మ, ఆర్ ప్రభాకర్ నాయుడు, నమ్మి లక్ష్మణ, చిల్ల సూర్యనారాయణరెడ్డి, చింతగుంట శివ, కుంచపు శివరామకృష్ణ, వెంపాడ వెంకటరమణ, దుంప సాయిరెడ్డి, తమ్మిన నరసింగరావు, జగన్నా ఎల్లాజీ , చేట్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

భారీ మెజార్టీ ఖాయం : ముత్తంశెట్టి

మధురవాడ: భీమిలి ప్రజలు వైఎస్సార్‌సీపీని ఎంతగానో ఆదరించారని, భారీ మెజార్టీతో తన గెలుపు ఖాయమని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. మంగళవారం సాయంత్రం కార్‌షెడ్ జంక్షన్ వద్దని వైఎస్సార్‌సీపీ ఎన్నికల కార్యాలయంలో ఆయన జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డులకు చెందిన ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. అన్ని స్థాయిల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తన గెలుపును వారి విజయంగా భావించి పనిచేశారని, వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.

మార్షల్ ఆర్ట్స్ దేహాభివృద్ధికి దోహదం

తగరపువలస: క్రమం తప్పకుండా శిక్షణ తీసుకునే మార్షల్‌ఆర్ట్స్ వలన దేహాభివృద్ధితో పాటు ఆత్మ విశ్వాసం, క్రమశిక్షణ పెరుగుతాయని ఆల్ ఇండియా మార్షల్ ఆర్ట్స్ చీఫ్ ఎగ్జామినర్ అండ్ చీఫ్ కోచ్ పి.నరసింహారావు అన్నారు. బ్లాక్ బెల్ట్ గ్రహీత బంగారు పరదేశి ఆధ్వర్యంలో నెలరోజుల పాటు ఆదర్శనగర్‌లో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. 35 ఏళ్ల పాటు పీఎస్ఆర్ మార్షల్‌ఆర్ట్స్ అసోసియేషన్ తరపున తగరపువలసలో శిక్షణ ఇస్తున్న పరదేశిని అభినందించారు. మరింత మంది విద్యార్థులు ఈ శిబిరంలో చేరి ప్రయోజనం పొందాలన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు బంగారు గౌతమ్, కర్రి చిట్టిబాబు, తమ్మిన అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మార్షల్ ఆర్ట్స్ శిక్షణను పరిశీలిస్తున్న ఆల్ ఇండియా మార్షల్ ఆర్ట్స్ చీఫ్ ఎగ్జామినర్ నరసింహారావు

ఘనంగా ముగిసిన జట్లమ్మ ఆలయ వార్షికోత్సవం



జట్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఆలయ ట్రస్టు చైర్మన్ పవన కుమార్ వర్మ



అమ్మవారిని దర్శించుకునేందుకు బారులుదీరిన భక్తులు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో మూడు రోజుల నుంచి జరుగుతున్న జట్లమ్మ ఆలయ మూడో వార్షికోత్సవ మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నవ గ్రహ, వాస్తు, యోగిని, క్షేత్ర పాలక, సర్వ భద్రతో మండపాలకు మంత్ర ఆవాహన పారాయణ హోమాలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. దీనిలో భాగంగా చిడతలు తప్పెటగుళ్ల వంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ట్రస్టు చైర్మన్ రాజాసాగి వవన కుమార్ వర్మ, పాండ్రంగి కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు అముజూరి అప్పారావు, మాజీ ట్రస్టు చైర్మన్ రాజాసాగి దేముడు బాబు, కొసర అప్పలనాయుడు, అధిక సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ఆ పాఠశాలకు విశేష గుర్తింపు

తగరపువలస: భీమిలి నియోజకవర్గంలో సీబీఎస్ ఈ–న్యూఢిల్లీ(120895) గుర్తింపు పొందిన ఏకైక జెడ్పీహైస్కూల్–చిట్టివలసగా పేరు పొందింది. రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి పాఠశాలలకు ఈ గుర్తింపు లభించగా, జిల్లాలో 11 పాఠశాలలకు ఈ గౌరవం దక్కింది. వాటిలో కేజీబీవీ మినహా నియోజకవర్గంలో ఈ ఘనత సాధించింది ఈ హైస్కూల్ మాత్రమే. పీఎంశ్రీ పాఠశాలగా ఎంపికైంది. 2022–23 విద్యాసంవత్సరంలో 8వ తరగతి నుంచి గుర్తింపు పొందిన ఈ పాఠశాల నుంచి 2024–25 విద్యాసంవత్సరం మొదటి బ్యాచ్ విద్యార్థులు సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షలు రాయనున్నారు.

పాఠశాల ప్రత్యేకలు ఇవీ...

- 1972లో ఉన్నత పాఠశాలగా ప్రారంభమైన ఈ స్కూల్‌కు చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులు అప్పట్లో ఒక్కరోజు కార్మికుని వేతనం రూ.16తో సుమారు 6వేల మంది కంట్రిబ్యూషన్‌తో స్థలాన్ని కొనుగోలు చేశారు.
- 2018–19 విద్యాసంత్సరం నుంచి 2022–23 విద్యాసంవత్సరం వరకు ఏడుగురు విద్యార్థులు ఈ పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీలలో ప్రవేశం పొందారు. 2022–23 విద్యాసంవత్సరంలో భీమిలి మండలంలోనే అత్యధికంగా 585 మార్కులు ఈ పాఠశాల విద్యార్థికి లభించాయి. ఆ ఏడాది 17 మంది విద్యార్థులకు 500కు పైగా మార్కులు వచ్చాయి.
- 2018 నుంచి ఫ్రెండ్స్ ఫౌండేషన్ సాయంతో ఈ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా ఎన్ఎంఎంఎస్ పరీక్షకు శిక్షణ ఇస్తున్నారు. 2023–24 విద్యాసంవత్సరంలో ఇక్కడ నుంచి తొమ్మిది మంది విద్యార్థులు రూ.12వేల వంతున నాలుగేళ్ల వార్షిక ఉపకార వేతనానికి ఎంపికయ్యారు.
- 2019లో కోవిడ్ కారణంగా జరిగిన ట్రిపుల్ ఐటీ పోటీ పరీక్షలో పాఠశాలకు చెందిన ఆర్.శృతి భాను 11వ ర్యాంకు సాధించి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంది.
- ఏటా జరిగే కౌశల్ పోటీలలో 2021 నుంచి పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం సాధిస్తున్నారు. ఇటీవల ఇస్రో నిర్వహించిన స్పేస్ వీక్‌లో పాఠశాలకు మూడు బహుమతులు లభించాయి.
- 5 వేల పుస్తకాలతో కూడిన గ్రంథాలయం ఉంది. జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో విద్యార్థులు పతకాలుసాధిస్తున్నారు.



చిట్టివలస జెడ్పీహైస్కూల్

సర్వీస్ రోడ్డులో అంధకారం



తగరపువలస సర్వీస్‌రోడ్డులో వెలగని లైట్లు



సంగివలస ఫ్లై ఓవర్ కింద వెలగని లైట్లు

తగరపువలస : స్థానిక సర్వీస్‌రోడ్డుతో పాటు పాక్షికంగా జాతీయరహదారిపై విద్యుద్దీపాలు వారం రోజులుగా వెలగడంలేదు. సర్వీస్‌రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు కారణంగా విద్యుద్దీపాలు వెలగని చోట ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్టు చుట్టపక్కల గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాత్రి 10 గంటల వరకు సర్వీస్ రోడ్లను ఆనుకుని దుకాణాలు తెరచి ఉండటంతో వాటి వెలుగు కొంత సహకరిస్తున్న ఆ తరువాత ఈ మొత్తం సర్వీస్‌రోడ్లపై అంధకారం ఉంటుంది. అలాగే జాతీయరహదారిపై కూడా వెలుతురు లేక పోవడం భారీ వాహనాల రాకపోకలకు కొంత ఇబ్బంది కలుగుతుంది. విశాఖ, విజయనగరం ప్రాంతాల వైపు నుంచి వచ్చేవారు సంగివలస, తగరపువలస గ్రామాల్లోకి వెళ్లేందుకు ఈ ఫ్లై ఓవర్ కింద మార్గాన్ని ఎంచుకుంటారు. వీధిదీపాలను జీవీఎంసీ పునరుద్ధరించాలని కోరుతున్నారు.

దివీస్ పార్కు వద్ద బెదురు బెదురుగా..

సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయం నుంచి తగరపువలస వైఎస్సార్ జంక్షన్ వరకు సర్వీస్ రోడ్డులో ప్రయాణం బెదురు బెదురుగా ఉంటుంది. ఈ మధ్యలో దివీస్ పార్కు, చెరువు ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటం వలన గతంలో అగంతకులు దారి కాచి ద్విచక్రవాహనదారులపై దాడి చేసి దోచుకునేవారు. ఇప్పుడు ఈ మార్గంలోనే చీకటిగా ఉండటంతో ఇక్కడ ద్విచక్రవాహనారులు ఒంటరిగా రాకపోకలు సాగించడానికి సాహసించడం లేదు. జాతీయరహదారితో పాటు సర్వీస్‌రోడ్డు, సంగివలస ఫ్లై ఓవర్ కింద విద్యుద్దీపాలను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ శ్రేణులకు కృతజ్ఞతలు

పద్మనాభం: వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మి, ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు గెలుపే లక్ష్యంగా విస్తృత ప్రచారం చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ రెండు నెలలు వైఎస్సార్ సీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని వివరించామన్నారు.అభ్యర్థుల ప్రచారానిరి తరలివచ్చిన కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు.

అపార్ట్‌మెంట్‌లో వ్యక్తి మృతదేహం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ కళాగ్రామం సమీపంలోని వుడా అపార్ట్‌మెంట్‌లో ఓ వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ అపార్ట్‌మెంట్‌లో ఓ గది నుంచి దుర్వాసన రావడంతో ఇక్కడ నివాసులు మంగళవారం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చేరుకుని గదిలోకి వెళ్లి చూడగా ఓ వ్యక్తి మృతదేహం కనిపించింది. సుమారు నాలుగైదు రోజుల క్రితం వ్యక్తి చనిపోయిఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. శ్యామ్ శివ ప్రసాద్‌గా గుర్తించారు. ఇక్కడకు ఎలా వచ్చాడు. ఎక్కడ నుంచి వచ్చాడు. ఇది హత్యా, ఆత్మహత్య అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి పూర్తి వివరాలు తెలియరాలేదని, వివరాలకు భీమిలి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

ఏపీఆర్‌జేసీ ఫలితాలలో శశి విద్యార్థులకు ర్యాంకులు

తగరపువలస: మంగళవారం ప్రకటించిన ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో సంగివలస శశి విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు లభించాయి. రాష్ట్ర స్థాయిలో ఆర్.దర్శన్‌కు 8, కె.గీతిక 12, జి.చరణ్ 14, కె.నీహారిక 20, వి.భరత్ గోపాల స్వామి 29, ఎస్.ఐశ్వర్య 31, ఆర్ దిలీప్‌కుమార్ 32, డి.వర్షిణి 35, సిహెచ్ యోగామృత 36, కశ్యప్ 40, యామిని 40, సందీప్‌కు 49వ ర్యాంకులు లభించాయి. వీరిని చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ క్రాంతి సుధ అభినందించారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు



వస్త్రాలంకరణలో సంతపేట కొత్తమ్మతల్లి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మతల్లిని మంగళవారం వస్త్రాలంకరణలో భాగంగా కోన శ్రీనివాస్, నవ్య బహూకరించిన చీరతో అలంకరించారు. అలాగే వీళ్లు అమ్మవారి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబను మామిడిపండ్లు, చామంతులు, గజమాలలతో అలంకరించారు. ఈ అలంకరణకు గాను కృష్ణంరాజుపేటకు చెందిన బమ్మిడి నరసింగరావు, మంగ సహకరించగా భక్తులకు తుపాకుల అప్పలరాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

కూలడానికి సిద్ధంగా సీసీ కెమెరాల స్తంభం



తుప్పు పట్టి కొన అంచుతో ఉన్న స్తంభం

తగరపువలస: స్థానిక అంబేడ్కరు కూడలిలో సీసీ కెమెరాలు అమర్చిన స్తంభం అడుగు భాగం తుప్పు పట్టి ఏ క్షణమైనా కూలడానికి సిద్ధంగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ కూడలిలో ఈ స్తంభం కూలితే ప్రమాదం జరగవచ్చని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భీమిలి పోలీసులు జోక్యం చేసుకుని ఈ స్తంభం మార్చడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బెట్టింగ్ బంగార్రాజులు

- జోరుగా సాగుతున్న పందాలు
- ఓ వైపు ఐపీఎల్..మరో వైపు పొలిటికల్
- రూ.కోట్లకు చేరుకున్న జూదం



పెందుర్తి: 'ఈ ఓవర్లో వికెట్ పడుతుంది..మీది వెయ్యి మాది ఆరు వందలు'. మ్యాచ్‌లో ఫలానా జట్టు గెలుస్తుంది..మీ పందెం పదివేలు..మాది పదిహేను వేలు' ఇది ఐపీఎల్ రోజువారీ బెట్టింగ్..మా పార్టీ అభ్యర్థి గెలుస్తాడు.. మా పార్టీ అభ్యర్థి మెజారిటీ ఇంత'మీ పందెం రూ.లక్ష..మాది రూ.70 వేలు' ఇది రాజకీయ జూదం.. పెందుర్తి ప్రాంతంలో పందాల జోరు హోరెత్తుతోంది. ఓ వైపు ఇండియన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగడంతో మ్యాచ్‌లపై బెట్టింగ్‌లు యథేచ్ఛగా సాగుతున్నాయి. మరోవైపు ఇండియన్ పొలిటికల్ లీగ్ తోడవడంతో బెట్టింగ్ రాయుళ్లకు పండగే పండగ. పట్టణం, పల్లెలు తేడా లేకుండా పందాలు జోరందుకున్నాయి. దాబాలు, రెస్టారెంట్‌లు, హోటళ్లు, అపార్ట్‌మెంట్లు వేదికగా క్రికెట్‌తో పాటు పొలిటికల్ బెట్టింగ్‌లు సాగుతున్నాయి. నగటున రూ.లక్షలు పందం కాస్తుండగా మొత్తంగా కలిపి రూ.కోట్లకు చేరినట్లు తెలుస్తోంది. ఐపీఎల్ నాకౌట్ పోటీలతో పాటు ఎన్నికల ఫలితాలకు రోజులు దగ్గర పడుతున్న కొద్దీ ఈ బెట్టింగ్ విశ్వరూపం దాల్చే పరిస్థితి కనబడుతోంది. ఈ బెట్టింగ్‌లకు నగదుతో పాటు ఆస్తులు, వాహనాలు, బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు కూడా పెడుతున్నట్లు తెలుస్తుంది.

మీది ఇంత.. మాది ఇంత

ఐపీఎల్ విషయానికి వస్తే ఓవర్‌కు పరుగులు, వికెట్లు పడే సమయాలు, నోబాల్‌లు, వైడ్లు ఎప్పుడు పడతాయి.. ఫోర్లు, సిక్సర్లు ఎప్పుడు కొడతారు. వీటికి రూ.వేలల్లో పందాలు వేసుకుంటున్నారు. ఆఖరిగా మ్యాచ్‌ల ఫలితాలపై భారీగానే పందాలు సాగుతున్నాయి. జట్ల బలబలాల బట్టి పందెంరాయుళ్లు బరిలోకి దిగుతున్నారు. ఒక జట్టు బలహీనంగా ఉంటే దానిపై తక్కువ మొత్తం పందెం వేస్తున్నారు. బలమైన జట్టు వైపు ఉన్నవారు దానికి కాస్త ఎక్కువ మొత్తం పందెం కాస్తున్నారు. ఉదాహరణకు బలమైన జట్టుపై రూ. పది వేలు పెడితే..బలహీనమైన జట్టుపై రూ.5 వేలను నుంచి 7 వేల వరకు. ఈ పందాల కోసం ప్రత్యేకంగా పేకాట మాదిరిగా డెన్లు ఏర్పాటు చేసుకుంటున్నట్లు సమాచారం.

కోసు పందాలు

రాజకీయ బెట్టింగ్ విషయానికి వస్తే వివిధ పార్టీల అభ్యర్థులు విజయం సాధిస్తారని..అదే సమయంలో వారికి వచ్చే మెజారిటీపై కూడా పందాలు నడుస్తున్నాయి. ప్రస్తుతానికి ఎన్నికల ఫలితాలకు దాదాపు 20 రోజులు సమయం ఉన్నందున ప్రాథమికంగా రూ.లక్షల్లో పందాలు కడుతున్నారు. ఫలితాల రోజు దగ్గర పడుతున్న కొద్దీ బెట్టింగ్‌లు ఘననీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. పొలిటికల్ బెట్టింగ్ విషయంలో పందెంరాయుళ్లు సర్వేలను కూడా ఆధారం చేసుకుంటున్నారు. మొత్తానికి రానున్న మూడు వారాల పాటు బెట్టింగ్ వ్యవహారం జోరుగా సాగనుంది. అయితే ఈ మాయా జూదానికి పోలీసులు అడ్డుకట్ట వేయాల్సి ఉందని పలువురు భావిస్తున్నారు.

ప్రపంచ డెంగ్యూ దినోత్సవం రేపు

మద్దిలపాలెం : జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ డెంగ్యూ దినోత్సవం జరగనుంది. డెంగ్యూ ప్రబలడానికి కారణమైన దోమల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నారు. దీనిలో భాగంగా ప్రజల్లో చైతన్యాన్ని తీసుకురావడానికి ప్రదర్శనలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. డెంగ్యూ జ్వరం లక్షణాలు, నివారణ చర్య లు తెలియజేయనున్నారు.